# శీలం విలువ

—విశ్వనాథ పావనిశాస్త్రి

కామాపురం సంత కళకళలాడి పోతోంది. కాయగూరలూ, నేతచీరలూ, ఫారం గుడ్లూ, ఫారిన్ బుడ్లూ; ఫేస్ అండ్ వాషింగ్ సోపులూ, గడ్డి మోపులూ; రకరకాల చేపలూ, నైలాన్ చాపలూ; స్టీలు కంచాలూ, డబుల్ కాట్ మంచాలూ; సవరాలూ, చిలకలపూడి హారాలూ; చెప్పులూ, జడ క్లిప్పులూ; లడ్లూ, పప్పుతెడ్లు; దుంపలూ, పెళ్ళిగంపలూ; కేకులూ, దూదేకులూ; మురుకులూ, పెళ్ళికొడుకులూ; వడ్లూ, జాతి గొడ్లూ — ఒకటేమిటి, కావలసినవ్నీ కనిపించే కాణాచి కామాపురం సంత!

తండ్రి పెద్దకర్మలకి, గోదానం చెయ్యడానికి మంచి పవిత్రమైన ఆవుని బేరం ఆడటానికి కాముడూ, రాముడూ సంతకి బయల్దేరారు. సంతంతా ఎంత చెడ తిరిగినా మంచి ఆవు ఒక్కటి కూడా వాళ్ళకి కనిపించలేదు.

చాలాసేపటి నుంచి వాళ్ళిద్దర్నీ గమనిస్తున్న ఓ పెద్ద మనిషి, చిన్న సైజు టార్చిలేటు లాటి ఓ చుట్టని రెండు వ్రేళ్ళ మధ్యా పట్టుకుని వాళ్ళ దగ్గరగా వచ్చాడు. "ఏం బాబూ! మంచి ఆవు కోసం తిరుగుతున్నట్టున్నారు?" అన్నాడు. "మీరు చూస్తానంటే నా దగ్గర రెండు ఆవులున్నాయి" అన్నాడు.

ఆయన చూపించిన రెండావుల్నీ చూస్తూ ఎగిరి గంతేశాడు రాముడు. లక్కీలే గంతేసిన చోటే పడ్డాడు. కాని ఏం ప్రయోజనం? బట్టలన్నీ మట్టి అయినాయి. అయినా ఏమి దిగులు పడకుండా, "ఎంతసార్ ఒక్కొక్కటి?" అని అడిగాడు.

పెద్ద మనిషి తాపీగా, "పెద్దది ఐదు వేలు!" అన్నాడు.

కాముడు కళ్ళింత చేసుకుని "అబ్బో అంతే?!" అన్నాడు.

పెద్ద మనిషి తేలిగ్గా కొట్టి పారేస్తూ "అంతే మరి! సన్నాసావు!" అని మొదలుపెట్టాడు. "వయసులో బాగా చిన్నదీ! అనుభవం లేనిదీ! ఏ గడ్డి పడితే ఆ గడ్డే తింటుంది ఎదవావు! ఉలవలూ, పచ్చగడ్డీ వగైరా క్లాస్ ఫుడ్డు అడగనే అడగదు. రోజుకి రెండు పూట్లా రెండు శేర్లు మాత్రమే యిస్తుంది. ఇప్పటికి రెండీతలైంది. ఇంకా తేలిగ్గా అయిదారీతలు ఈనుతుంది. పనిగట్టుకుని జాతి ఆంబోతు దగ్గరికి తీసుకెళ్ళాల్సిన పని లేదు. మున్సిపాలిటీ చెత్త తినే ఏ ఎద్దయినా దీనికి మొగుడే! పిల్లలు పొదుగు ముట్టుకున్నా నోరెత్తదు."

ఆయన ధోరణికి విస్తుపోయిన రాముడు, "మరి చిన్న ఆవు?" అని అడిగాడు.

ఆయన ఎక్స్‌ప్రెషన్‌కి ఇంప్రెస్ అయిపోయిన కాముడు, "ఎంత సార్?" అని అడిగాడు.

"అబ్బో! అదా! అది గోల్డు కదూ!" అని పరవశంగా కళ్ళు మూసుకున్నాడు.

"చాలా చవక! ఏడు వేలు మాత్రమే!" అని కళ్ళు తెరిచాడు పెద్ద మనిషి.

కళ్ళు మూసుకుని ఊహాలోకాల్లో తేలిపోతున్న కాముడు, "పూట పూటా ఐదు శేర్లిస్తుంది కదు సార్!" అన్నాడు.

"ఇవ్వదు. అది ఇంతవరకూ కట్టలేదు" అన్నాడు పెద్దాయన కొంచెం సీరియస్‌గా.

"కట్టింతర్వాత యిస్తుంది గదా?" అన్నాడు కాముడు.

"నమ్మకం లేదు. ఇంతవరకూ ఒక్క ఆంబోతుని దగ్గరికి రానిస్తే గదా. మొన్న ఐతాపురం ఆంబోతుని ఆచి తన్నింది. అంతే! అది ఆ రోజులు లేవలేదు. నిన్న కారు మరచి ఆంబోతుని కసితీరా తన్నింధి. అది ఖతం! మజానానేమిటి మా ఆవంటే?!" అన్నాడు పెద్దాయన దృఢంగా.

రాముడికి మతిపోయి, "మరైతే అంత రేటెందుకయ్యా దానికి?" అని అడిగాడు.

అంతే! ఆయన ఖస్సుమని లేచాడు "క్యారెక్టరుకి బాబూ! క్యారెక్టరుకి! పవిత్రమైన ఆవు కావాలని బయల్దేరారు గదా అన్నదమ్ములు! ఇంతకన్నా పవిత్రమైన క్యారెక్టరు గల ఆవుని చూపించండి చూద్దాం. పెళ్ళి చేసుకునేటప్పుడు పెళ్ళి కూతురు క్యారెక్టరు కోసం ఓహ్ యిదైపోతావే?! మీ నాయన కర్మలకి క్యారెక్టరున్న ఆవు కావద్దా?"

అంతే! కాముడూ, రాముడూ ఆయన కాళ్ళ మీద పడిపోయారు. ●






బంగ్లాదేశ్ ప్రభుత్వం దోమల బెడద వదిలించుకోవడానికి వినూత్నమైన పథకం ఒకటి ప్రవేశపెట్టింది. ఎవరైనా ఒక కిలో బరువుండే చంపిన దోమల్ని ఆరోగ్య శాఖకు అప్పగిస్తే నాలుగు వందల యాభై రూపాయిలు బహుమానం. బీద దేశమైన బంగ్లాదేశ్‌లో ప్రభుత్వం కోర్కెను అంగీకరించి దీన్ని ఉపాధిగా తీసుకొని ఈ వృత్తిలోకి దిగారు

—ఎస్. రమేష్ చక్రవర్తి, వి. సావరం